# వంకర బ్రతుకు

ప్రభు



'విన్నావా..?'

[illegible]

వాడికసర్లమూ అంటూ వినిపించింది. "అయినా నాకెందుకులెండి అనవసరంగా..." ఏదేదో సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

* * *

నా ఆలోచనలు చీకటిని చీల్చి కాలాన్ని కొలిచాయి. గతంతాలూకు ఛాయలు నిర్జీవంగా కదుచుకొంటున్నాయి...

మీనాక్షి... మీనాక్షి నాకేమవుతుంది? ఏమీ కాదు. లోకందృష్టికి మాయింటిపక్క ఒకప్పుడు ఉండే సాంబయ్యగారి కోడలు. అంతే. కాని నా మనస్సులో ఆమెకో ప్రత్యేకత ఉంది. నాకు కూతురే గనక



ఉంటే దానికి మీనాక్షిలో ఉండే కల్చర్, ఒదుగుదనం సగం అబ్బితే నిజంగా చాలా మురిసిపోయేవాణ్ణి. పరిస్థితులకు లొంగని గాంభీర్యం ఏదో ఉంది ఆమెలో.

పదేనిమిదో ఏట మీనాక్షి పెద్ద కోడలుగా, జగన్నాథం భార్యగా ఆ యింటి కొచ్చింది. అంతకుముందు రెండు మూడేళ్ళయిందిట ఆ అమ్మాయి స్కూలు ఫైనలు పాసయి. జగన్నాథం అప్పట్లో ఏదో బాంకులో పనిచేస్తూ నూరో, నూటయాభైయో తెస్తూ ఉండేవాడు. కాస్తో కూస్తో పొలంమీద గింజ లొచ్చేవేమో. తండ్రికి పెన్షను డబ్బులు వచ్చేవి. మిగిలిన పిల్లలింకా కాలేజీచదువులకి రాలేదు. కనుక వాళ్ళకంత యిబ్బంది అప్పట్లో లేదనుకుంటాను. కనుక జగన్నాథం ఎలా ఎబ్బుతిగలేసినా ఎంత పట్టించుకోకుండా తిరిగినా ఎవరికీ అవసరం లేకపోయింది. తల్లికీ తండ్రికీ అతనేం చేస్తే అదో గొప్ప ఘనకార్యం. ఓ ముసలమ్మ ఉండేది. నాయనమ్మగాబోలు. ఆమెకు జగన్నాథం అంటే ఏ చక్రవర్తిలాగానో కనిపించేవాడు.

'మీనాక్షీ వాడులేచే వేళయినట్టుంది. కాఫీ ఫ్లాస్కులో పోసి ఉంచు.'

'వాడు చాకిరి చేసి చేసి వస్తాడు గదా. కాసిని వేన్నీళ్ళు కాచాలన్న జ్ఞానంలేదూ? మరి వాడు అరిచాడంటే అగవడూ."

"వాడికీపూట అన్నంలోకి వేపుడు ముక్కలున్నాయా? లేకపోతే వాడు తినలేడు అసలు. ఎప్పుడన్నా అలవాటా పాడా?"

ఇలాంటిమాటలే వినిపిస్తూ ఉండేవి అస్తమానం. ఇవి నిజానికి మామూలు మాటలే... కాని నాకేమిటో వెగటుగా, అతన్ని అవసరమైందానికన్నా ఎక్కువ గారాబంచేస్తున్నారనిపించేది.

"ఏయ్ మీనాక్షీ; ఎక్కడ చచ్చావే! తువాలేదీ?"

"కాసిని మంచినీళ్ళిద్దూ నీపాడు పుస్తకం అలా పారేసి. నీ చదువు తగలడ్డట్టే ఉంది."

"ఏడిశావులే. నీబోడి సలహా ఎవరిక్కీ అక్కర్లేదిపుడు."

"కాసినా కాఫీ అన్నా పొయ్యలేవేమే సోమరి? అన్నింటికీ అమ్మే రావాలా? ఆ కాఫీ అసలు నోట్లో పెట్టుకోలేం."...

ఇవీ జగన్నాథం అదిరిపాటులూ కేకలూ. ఎప్పుడన్నా సవ్యంగా భార్యతో మాట్లాడిన రోజుందేమోనని చూశా... నేను ఎప్పుడూ వినలేదు. అతనికో నాటకాలకంపెనీ: దానితో రాత్రీ పగలూ తిరుగుతూ ఉండేవాడు.

ఎప్పుడన్నా నేను వాళ్ళింటికి వెళ్తే మీనాక్షిని పలకరించేవాణ్ణి. ఆ మాట్లాడిన కొద్దిమాటల్లోనే ఆమెకు సాహిత్యంలో అభిరుచి ఉందని గ్రహించాను. తెలుగులో ఇంగ్లీషులో మంచి మంచి పుస్తకాలు చదివింది. విమర్శలుకూడా నిశితంగా ఉండేవి. కానీ పట్టుమని పది నిముషాలన్నా మాట్లాడిందేదీ? జగన్నాథం గనుక అక్కడే ఉంటే అవన్నీ ఓట్టిపనికిమాలిన విషయాలన్నట్టు నవ్వేసేవాడు. ఓమారు అన్నాను అక్కడికీ, "నీకి తెలుగుభాషతోబాటు కొద్దిగా సంస్కృతంకూడా రావాలమ్మా. చాలా చక్కని లిటరేచర్ ఉంది అందులో. చిన్న చిన్న పుస్తకాలిస్తాను. చూస్తావా ఏమిటి? ..."అన్నాను. ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు కదిలాయి. ఒక్క నిట్టూర్పు విడిచింది. అదే సమాధానం నాకు.

మీనాక్షికి పుట్టింటవేపు ఎవరూ లేరు. ఉన్న ఒక్క అన్నగారూ స్కూలు ఫైనలు చదివించి పెళ్ళి అయిందనిపించి చేతులు దులుపుకొన్నాడు. ఏం చేస్తాడు అతను మాత్రం, అంతకంటే? నలుగురు పిల్లలూ, రోగిష్ఠి భార్యా, పట్నంలో కాపురమూ, అందువల్ల మీనాక్షికి పుట్టింటికి రాకలూ పోకలూ పండగ పబ్బాలకు పెట్టుపోతలూ ఆశే ఉండేవి గావు...అదీ ఒకగడ్డు సమస్యే అయింది మీనాక్షి బతుక్కి. "ఓ అచ్చటా ముచ్చటా... పెళ్ళి యింతరువాత ఓనాటే నా ఎరగడు. ఇంతకీ మొహాన రాసిపెట్టి ఉండాలి దేనికనా" అంటున్నది శారదతో మీనాక్షి అత్తగారు ఒకరోజు పొద్దున్నే. పక్కనే మీనాక్షి నూతిగట్టుమీద చెంబులు తోముతున్నది.

"ఏమి అదిరిపాటే అది. ఇంకా నారెలూ చీరెలూ వేసుకొస్తే ఎలాఉండేదానివో! మా సీతమ్మకు కోడలురాగానే కొడుక్కి పెద్దఉద్యోగం అయింది. ఇంతకీ ఆడదాని అదృష్టం... కోడలొచ్చిన వేళా గొడ్డువచ్చిన వేళా అన్నారు..."ఇలాఅర్థంపర్థంలేకుండా సందర్భం అయినా కాకపోయినా వాగుతోంది రాత్రి తొమ్మిది గంటలవేళ ముసలమ్మగారు.

'చక్కగా మోహన్‌రావుకి అత్తారు. పండక్కిపిలిచి రేడియో కొనిపెట్టారు. సీతారాముడు గాబర్డిన్‌సూటు తెచ్చుకొన్నాడు. నేనూ ఉన్నాను అల్లుణ్ణి అంటూ ఎందుకూ..' అని సణుగుతున్నాడో రోజు జగన్నాథం.

కిందటేడు టైఫాయిడు వస్తే వంద రూపాయిలయింది మందులకే. అన్నగారు వచ్చిచూసి చక్కాపోయాడు. పళ్ళకీ పాలకీ లెక్కా పత్రమా? ఇదీ మామగారి మాటల సారాంశం.

మనుష్యుడిలో పశుప్రవృత్తి ఉంటుందంటారు అణిగీమణిగీ. కాని యిది రాక్షస ప్రవృత్తిగాదూ. ప్రక్కనమనిషిని తెలిసి తెలిసి యిలా హింసించటంలో ఆనందం ఏమిటి లభిస్తుందో? రోడ్డుమీద పడుకున్న

పక్కను పడుకున్న కుర్రవాడు ఉత్తపుణ్యానికి తన్నేస్తాడు. మేష్టారు ఉన్న ఒక్క తెల్లని చొక్కా మీదా గంగసిగా చిలకరించి ఓపెనింగ్ లాగా మహదానందం పొందుతాడు భావిభారత పౌరుడు. చక్కగా నాటకం చూస్తున్న అమ్మాయిలమధ్య టపాకాయలు పేల్చి బెదరగొట్టి హీరోల్లాగా పోజులుపెడ్తారు యువకధీరులు. రాత్రి సినిమాలో నాయకురాలి దరిద్రం ఎలా తమను కరిగించి కన్నీళ్లు తెప్పించిందో తరిస్తూ దగ్గరకు వచ్చిన ముష్టిపిల్లను మాటి మాటు గంగలుతిప్పి వెక్కిరించి పొమ్మంటారు నేటి మిడిసిపాటు అమ్మాయిలు. ఏమిటో ఈ హింసాకాండ? భగవంతుడిచ్చిన కొద్ది సౌఖ్యమూ యిలాంటి పొరుపుమాటలతో, అతకని బతుకులతో అంతం చేసుకొంటారెందుకనీ? ఏనాడు చేసుకొన్నారో ఆనాడే తెలీదూ ఆ అమ్మాయి అంతిస్థూ. అంతగా కానుకలూ, ముచ్చట్లూ కావాలనుకొనేవారు మరో పెదసంబంధమే చూసుకోగూడదూ? అసలు బాగా ఉన్నవాళ్లు యేం చూసియిస్తారు వీడికి? పండగలూ పబ్బాలూ మనస్సును ఉల్లాసపరుచుకోటానికి గాని యిలా మనస్సులు బాధపెట్టుకోటానికా?

ఆ అమ్మాయి మనస్సు ఎంతబాధ పడుతున్నదో ఈ మాటలతో. ఆమె నేర్పిన ఆ కొత్తచదువూ తనజీవిత సమస్యలను తీర్చుకొనటానికి ఎలా పనికివస్తున్నది? అయినా మీనాక్షి ఎవరితో కంప్లెయింటు చేసినట్టే ఉండేదిగాదు. చేస్తేమాత్రం లాభంవిముంది.

* * *

అరమూ పరమూ లేకుండా పరుగెత్తుతున్న ఆలోచనలు పిల్లవాడియేడుపుతో తెగిపోయినాయి. చిక్కుపడినతాడుకి మళ్లీ మొదలందలేదు. దొరికినచోట ముడిపెట్టాను.

"ఏడిశాడు లెద్దూ. బోడి ఎ.ఎ. నన్ను పోకిరా అంటాడూ, ఎంత పెద్దఫీసరయితే మాత్రం. మాటలంటే పడతానా? నాకు మాత్రం సెల్ఫ్ రెస్పెక్టు లేదూ. పెకొలాడుకుంటూ పనులే చెయ్యాలట. ఇలా అయితే నీఉద్యోగం ఆట్టేరోజులు నిలవదన్నాడు. ఎప్పుడో ఎందుకు ఇప్పుడే రిజైన్ ఇచ్చి చక్కా వచ్చాను. నాయిష్టం వచ్చినట్టుంటా. నన్ను అడిగేదెవరు?" ఇలా ధూముధాములు చేస్తున్నాడు జగన్నాథం వంటింట్లో ఒకరోజు.

సాయంకాలం వాళ్లమ్మ ఎవరితోనో అంటున్నది.

'అవునమ్మా! చిన్నప్పటినుంచీ వాడంతేరే అంతే. ఎవ్వరికీలొంగడు. మాటంటే పడేరకం గాదు. వాడికంత రోషం మరి. ఉద్యోగం అయ్యేది మరోటయ్యేద.'

నేనీమాటలు విని నవ్వుకొన్నాను. అందరూ

## వంకర బ్రతుకులు

అంగాగే అనుకుంటే. కాని బయటికి అనగలనా ఆమాటల్ని?

అయితే ఈ ఆనందం ఆట్టేరోజులు నిలవలేదు. కేవలం తండ్రిపెన్షనుతో బండినడవటం లేదు. ఆయేడు పంటగింజలూ తిన్నగా రాలేదు. జగన్నాధానికి ఉద్యోగంపోయినా దానివల్లవచ్చిన అలవాట్లుమాత్రం పోలేదు. అతని అధికారం యింకాస్త యెక్కువే అయింది. పంచదార తక్కువైతే గ్లాసు నే

# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

# ఉగాది నవల పోటీ

1961 ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో ఆకర్షణగా నవల పోటీ నిర్వహించడానికి నిశ్చయించాము. రచయితల సహకారం అర్థిస్తున్నాము.

ఈ పోటీని తెలుగు వారికి సంబంధించిన సాంఘిక నవలలకు మాత్రమే పరిమితం చేయడానికి నిశ్చయించాము. ఇతివృత్తం ఫలానా విధమైనదిగా ఉండాలనే నిబంధన మేమీ లేదు.

అయితే పోటీలో పాల్గొనేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలను గమనించవలసి ఉన్నది:

పోటీలో పాల్గొనడానికి ప్రవేశ రుసుము ఏమీలేదు. ఎవరు అయినా పాల్గొనవచ్చు. నవల వ్రాత ప్రతి ఫుల్‌స్కేప్ సైజు 150—200 కాగితాలకు పరిమితమై ఉండాలి. కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయవలసి ఉంటుంది. వాటిని పంపేటప్పుడు 'ఉగాది నవల పోటీకి' అని కవరుమీద స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. బహుమతి పొందని నవలలను త్రిప్పి పంపగోరువారు వాటితో తగు మాత్రం పోస్టేజి పంపవలసి ఉంటుంది. బహుమతి పొందకపోయినా యోగ్యమైనవాటిని తరువాత ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించగలము. 1961 ఫిబ్రవరి 28 వ తేది తరువాత చేరే నవలలను పరిశీలించడం జరుగదు. (క్రిందటి సంచికలో ప్రచురించినట్లుగా 1961 జనవరి 31 వ తేదికాదు.)

బహుమతి పొందిన నవలను ఉగాది ప్రత్యేక సంచిక నుండి వరుసగా ప్రచురించగలము.

## ఉత్తమమైన నవలకు

## బహుమతి రు 250 లు

**నవలలు మాకుచేరవలసినఆఖరితేది 1961 ఫిబ్రవరి 28.**

—సంపాదకుడు.

తీసికొట్టిన చప్పళ్ళూ, కూరలేనప్పుడు కంచం విసిరికొట్టిన మోతలూ అంతకంతకు ఎక్కువవుతున్నాయి. అతని కోపతాపాలకు గురి అయ్యేది మీనాక్షి. అప్పుడప్పుడు చెయ్యికూడా చేసుకోనేవాడనుకుంటాను.

కథ యింతటితో ప్రస్తుతానికి ఆగిపోయింది. కారణం వాళ్లు మాకు దూరంగా వెళ్లటమే. శారద ఒకరోజీవార్త తెచ్చింది పరమసంతోషంతో. మీనాక్షి అంటే నాకున్న అభిమానానికి శారద కెందుకో అనుమానం జెలసీ. చిత్రమేమిటంటే శారదా అలాంటి సర్కిలులోనుంచే వచ్చిందిగాని మీనాక్షిని తప్పుపట్టటంలో ఆమెకూడా ఎవరికీ తీసిపోయేదిగాదు. 'అసలాపిల్ల పైకి అలా కన్పిస్తుందిగాని ఓట్టిసాదుపలవండీ. మొగుడు కోపదారి అని తెలుసుగా. ఎందుకంత ఇదవటం ఊరికే" అనేది. పైగా ఆమె సానుభూతికూడాజగన్నాథానికే. వట్టిబోళా మనిషి. కావలిస్తే నెత్తినపెట్టుకుంటాడు. లేకపోతే బడబడా తిట్టేస్తాడు.

ఇదే నిజమయితే యింతకంటే దారుణం ఉంటుందా? కావలిస్తే నెత్తిన పెట్టుకోటానికి, లేకపోతే కాలరాయటానికి ఇదేమైనా వస్తువా! అతని దృష్టిలో తిని విసిరేసిన పళ్ళానికీ, తన్ని పారేసిన పెళ్ళానికీ భేదం లేదన్నమాట.

ఏదిఏమయినా నేనూ శారదా పాత్రధారుల మయినాము, అనుకోకుండా మీనాక్షికథలో. మీనాక్షికి కొడుకుపుట్టాడని శారదే గాబోలు ఓమాటు వార్త తీసుకొచ్చింది. అది నాకో విధంగా విచారమే కలిగించింది. సంతానం ఆనందదాయకమే? ఎవరికి? సిరిసంపదా ఉన్నవాళ్ళకి. పోనీ యివేమీ లేకపోయినా కనీసం దంపతుల మధ్య అనుకూల్యం అయినా ఉండాలి. మీనాక్షి సమస్యలు పిల్లాడు పుట్టటంతో మరి కొన్ని క్లిష్టమే అవుతాయిగాని తగ్గవు. తను గనుక యేది కొలువుచేస్తున్నా కొంత కొక్కటుని అవసరాలు గడుపుకుందిగాని యింక పిల్లాడు.

ఇంచుమించుగా రెండేళ్ళకిందట మీనాక్షి కథ యిది. ఇవ్వాళ శారద ద్వారా తన జీవి

# వంకర బ్రతుకులు

తంలోని మలుపు నాకు తెలియజేసింది. ఇది ఆమె పరిస్థితిని పతనమే చేస్తుందో బాగుపరుస్తుందో నాకు తెలీదు. శ్యామలరావుతో ఆమె వెళ్లిందంటే నమ్మలేకపోయాను. వాడి పేరు గూడా ఆమె విని ఉంటుందనుకోను. వాడి బతుకెలాంటిదో ఊళ్ళో చాలా మందికి తెలుసు. అదుపూ ఆజ్ఞా లేనివాడు. వాడు ఊళ్ళో లేకపోవట మేమీ కొత్త గాదు. పన్నెత్తి తనబాధ ఒకరితో చెప్పుకోని మీనాక్షి, ఎవరి సానుభూతీ ఏనాడూ ఆశించని మీనాక్షి యిలా పారిపోయిందని యెలా అనుకోను?

గడియారం కొట్టిన గంటలు నా ఊహలను చెదరగొట్టాయి. మళ్లీ ఏరుకొనే ఓపికలేక లోపలికి వచ్చాను. శారద మంచంమీద పడుకొని ఉంది. తెల్లని చీరా తలలోని తెల్లని మల్లెలూ నవ్వుతున్నాయి. మనిషికీ మనిషికీ ఎంత తారతమ్యం?

* * *

పదేళ్లు గిర్రున తిరిగిపోయాయి. మీనాక్షి సంగతి నాకేమీ తెలీదు. తెలుసుకోవాలని ప్రయత్నమూ చేయలేదు. ఈపరుగెత్తుతున్న రైలుబండి ఎవరికోసమూ ఆగదు మరి. మరో రెండునెల్లకు నాకు ట్రాన్స్ఫరుఅయి శాశ్వతంగా వచ్చేశాము ఆ వూర్నించి.

'స్త్రీజనశ్రేయానికీ, మానసిక సంస్కారానికీ సంబంధించిన పుస్తకం అచ్చేసున్నా. ఆ పనిమీద తిరుగుతున్న నాకు మా పెద్దవాడికేదో కాలు ప్రమాదం జరిగిందని వార్త వచ్చింది. అప్పటికే నాలుగురోజులయిందిట అది జరిగి. వాడు జూనియర్ ఇనస్పెక్టరుగా పనిచేస్తూ పల్లెటూళ్లె వెంబడి తిరుగుతూ ఉన్నాడు. పరుగెత్తుకుంటూ వెళ్లానా ఊరికి.

ఎక్కడి గోదావరిజిల్లా? ఆ ఊరు వెళ్లాలంటే ప్రయాణ సాధనాలన్నీ ఉపయోగించాల్సి వచ్చింది. రైలు, కారు, బండీ, పడవ, అన్నీ దిగి నాలుగు మైళ్లు నడిచి ప్రపంచానికి దూరంగా విసిరేసిన ఆఊరు చేరుకొన్నా సాయంకాలానికి. ఒక చిన్న యింట్లో పడుకోబెట్టారు మాసీనును. దెబ్బలంత ప్రమాదికరంగా లేవుగాని కదలలేకుండా ఉన్నాడు. కాలిమడిమ బెణికి వాచి ఉన్నది.

'మరేం కంగారులేదు నాన్నా. ఈ యింటి వాళ్లు చాలా మంచివాళ్లు. వాళ్లే లేకపోతే యేమయేవాడినో ఇప్పుడు అసలు కొద్దిగా నయం" అంటున్నాడు సీను. "నిన్ను ఇంటికి తీసుకెళ్తాను నాన్నా. బండిలో రాలేవా?"

"మేనాకోసం కబురు చేస్తాను. రేపు పొద్దున వస్తుంది. ఈలోగా తొందరేంలేదు లెండి. బండిమీద ఒళ్లంతా మళ్ళీ కదలిపోతుంది."

వెనకనుంచి వచ్చిన గొంతు పరిచితంగా ఉన్నది. తిరిగిచూసి నమస్కరించబోయి ఆగిపోయాను.

'ఆమే నాన్నా. ఈ ఊళ్లో ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నది. అలాంటి వారు నిజానికి ఊరికొక్కరున్నా చాలు."

ఏమిటేమిటో అంటున్నాడు సీను. నా మనస్సు ఏమీ వినిపించుకోలేదు. ఏవో పాతగాథలు తవ్వుతున్నది. అదే నిబ్బరం. అదే నిండుదనం. మీనాక్షి ఏమీ మారలేదు. కొద్దిగా వయసుమీరిన ఛాయలు తప్ప.


నన్ను చూసి ఏమీ ఆశ్చర్యపోలేదామె. నేను వస్తానని ఎదురుచూస్తున్న దానల్లే కనిపించింది. తల చక్కగా దువ్వుకొంది. మొహాన బొట్టు ఆ సంజెవెలుగులో మెరుస్తున్నది. కట్టుకొన్న చీర పరిశుభ్రంగా ఉంది.

సీనుకి ఎలా దెబ్బతగిలిందో క్లుప్తంగా వివరించింది. పక్క ఊరునుంచి డాక్టరు వచ్చి కట్టుకడుతున్నాడుట. ఎక్కడా ఫ్రాక్చర్ కాలేదంటున్నాడు డాక్టరు. అయినా పట్నానికి తీసుకెళ్లి ఎక్స్ రే తీయిస్తే మంచిది. ఇలా మాట్లాడుతుండగానే పది పన్నెండేళ్ల కుర్రవాడొకడు ఏదో సీసా పట్టుకొచ్చాడు.

"అమ్మా డాక్టరుగారు ఈ మందు మూడుసార్లిమ్మన్నారే. కాలుకి కాపడం పెట్టమన్నారు. ఈ మాత్రలు మూడేసి గంటలకొకటి......"

ఆ గొంతువిని ఉలిక్కిపడ్డాను. అది జగన్నాథం గొంతు. మీనాక్షి అతి మామూలుగా వచ్చి సీనుని లేవదీసి మాత్ర మింగించింది. టెంపరేచర్ చూసింది. లోపలికి పోయి కుంపటీ నీళ్లూ తెచ్చి కాలికి కాపడం పెడుతున్నది. పిల్లవాడు పక్కనేఉండి ఆమెకు సహాయపడుతున్నాడు.

చూస్తూ ఉండటంకంటె ఏమీ చేయలేకపోయాను. నిమ్మదిగా బయటికి వచ్చాను. ఎఱ్ఱని రంగు దిక్కులను పులుముకొంటున్నది. గొల్లపిల్లవాడొకడు సినిమాపాటలు కీచు

సంజీగూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము.

గొంతుతో పాడుకొంటూ పోతున్నాడు. ఆడవాళ్లు నీళ్లు తెచ్చుకొంటున్నారు. పశువుల కాలిత్రొక్కిడికి దుమ్ము రేగుతున్నది. ఎక్కడో ఓ ఏగిలకి గిరగిరా తిరుగుతూ చప్పుడు వినిపిస్తున్నది. దూరంగా పంట కాలువలో బాతులు ఈదుతున్నాయి.

మీనాక్షి చేతిలో లాంతరుతో బయటికి వచ్చి అక్కడేఉన్న చిన్న బల్లమీద పెట్టింది.

"మేష్టారూ నేనింకా జ్ఞాపకానికి రాలేదా?"

"గుర్తుపట్టాను మీనాక్షీ... కాని నువ్వు కూడా... ఎలా?" మాటలు పెగలక తడుముకొన్నాను.

చిన్నగా నవ్వింది. అందులో విషాదం నిండిఉందేమో అనిపించింది. కనీసం నా కళ్లకి.

గోపివచ్చి అరుగుమీద చాప వేసుకుని దీపం పెట్టుకొని పుస్తకాలతో కూర్చున్నాడు. చాయ తండ్రిదేమోగాని పోలిక అంతా మీనాక్షిదే. మీనాక్షి నాతో యింకేం మాట్లాడకుండా వాడిపక్కన కూర్చున్నది. వాడి యెదుట యిలాంటివి ప్రసంగించటం యిష్టం కాదేమో. నాకేమీ తోచక గన్నేరుచెట్టు సందుల్లోనించి క్షీణిస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నాను: సీను బాధగా "అమ్మా" అని మూలిగాడు. లోపలికి వెళ్లిపోయాను.

ఆరాత్రి భోజనం చెయ్యలేదు నేను. అలాగే సీను పక్క కూర్చున్నాను. మీనాక్షి మధ్య మధ్య వచ్చి పలకరించి పోతున్నది. లోపల నుంచి గిన్నెలూ, పళ్లాలూ చప్పుడవుతున్నాయి. నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. నాకు మనస్సులో సీనునుగురించిన దిగులూ ఆందోళనా... మీనాక్షిని గురించి కుతూహలమూ. ఏమీ తోచటంలేదు... తొమ్మిది గంటలయిందేమో... హాల్లో ఏదో గొంతు వినపడింది. "బాబు పడుకున్నాడా?"

"ఆ. ఇప్పుడే. ఇంత ఆలస్యమైందేం ఇవాళ."

"లారీ మధ్యలో చెడిపోయిందిలే... నడిచి వచ్చాను. ఆకుర్రాడి కెల్లా ఉంది?"

"కొంచెం నయమే. జ్వరం రాలే దివాళ. వాళ్ల నాన్నగారు వచ్చారు సాయంకాలం. రేపు పొద్దున తీసుకెళతానన్నారు."

అప్పుడే తొందరేం పాపం. కాలు కాస్త సద్దుకోనీకూడదూ.

ఇంక మనస్సు ఆగక గుమ్మందగ్గరికి వచ్చాను. హాల్లో మంచంమీద పడుకొన్న గోపీ జుట్టు సవరిస్తూ మాట్లాడుతున్నా డెవరో? నా అలికిడి విని తిరిగిచూశాడు. శ్యామలరావే.

ఏ విషయం నేను నమ్మలేకపోయానో... దేన్ని గూర్చి చెప్పితే కసిరికొట్టానో అది ఆకారం ధరించి యెదుట నిలబడింది. మీనాక్షి అంటే నాకుండే గౌరవం అభిమానం తుడిచిపెట్టుకుపోయినాయి ఒక్కసారిగా. ఆపదలో దిక్కూ మొక్కూ లేని పల్లెటూళ్లో నా పిల్లవాడిని రక్షించిందన్న కృతజ్ఞతకు గూడా నా మనస్సులో స్థానం లేదు. ఎప్పుడెప్పుడు పారిపోదామా అనిపించింది అక్కడినుంచీ. తెల్లవార్లూ ముళ్లమీదఉన్నట్లే ఉన్నాను.

సీను కదిలినప్పుడల్లా మీనాక్షి పక్క సర్దుతునే ఉన్నది. మంచినీళ్లు లేవదీసి యిచ్చింది. నారింజపండురసం తీసియిచ్చింది. నేతికట్టు చెదిరితే సరిచేసింది. తెల్లవారే వరకూ ఇదేపని ఆమెకు. ఎంత చేసినా ఆమె చేసిన పాపపనికి ప్రాయశ్చిత్తం కాగలదా?

పొద్దున్నే చెరువుకి వెళ్లి స్నానంచేసి వచ్చాను. గోపీ కాఫీ తెచ్చి యిచ్చాడు. తాగనని తిప్పికొట్టాను. నా కళ్లలోని మూగభావాలు చదివిందేమో. మీనాక్షి దగ్గరనుంచి బలవంతం రాలేదు. ఎనిమిది గంటలకు మేనా వచ్చింది. శ్యామలరావు మరోయిద్దరూ కలిసి సీనును మేనా యెక్కించారు. సీనే స్వయంగా హీనస్వరంతో మీనాక్షితో ఏదో అన్నాడు గాని నా కృతజ్ఞతను కనీసం మాటల్లోనయినా వెల్లడించలేదు.

* * *

తిరిగి మీనాక్షినిగురించి వినటం అనేది జరిగింది ఆరేళ్ల తరువాత. అలా వినకపోతే యింత భయంకరంగా ముగిసేదికాదు కథ. మనుష్యుడికి బుద్ధినీ మాటలనూ భగవంతుడు ఎందుకిచ్చాడో! అలా లేకపోతే యిన్ని దురంతాలు జరిగి ఉండకపోను. సరే యివన్నీ ఎందుకు! జరిగింది చెబుతున్నా. కనీసం అది కొంతవరకూ నా పాపాన్ని తగ్గిస్తుందేమో?

ఆరోజు కాలేజీలో ఏదో ఉత్సవం. రిటైరుఅయి ఓమూలకూర్చొని పుస్తకాలు రాసుకొంటున్న నన్నే పిలవాలా వాళ్లు? సరే వెళ్లాను—ఆ ఉత్సవంలో ఓకుర్రాడు బి. ఎ. చదువుతున్నాడుట. తెలుగుసాహిత్యం తీరూ తెన్నూ చక్కగా చర్చించాడు. చాలా ఒరిజినలుగా ఉన్నాయి అతని ఉద్దేశాలు. అతని తెలివితేటలకీ వాగ్ధోరణికీ ఆశ్చర్యపోయాను. ఈ మాత్రం పరిజ్ఞానంకలవాళ్లున్నారంటే మన కాలేజీలు ఫర్వాలేదనిపించింది. శ్లోకాలూ పద్యాలూ అతను ఉదాహరిస్తూఉంటే కమ్మగా నిద్ర వచ్చేటట్టున్నది అతని గొంతు. వచ్చేస్తూ కుతూహలంపట్టలేక ప్రక్కనున్న ఎవరినో ప్రశ్నించాను.

ఎవరో రాజాపురంట. గోపాలకృష్ణ అంటారు. పోయినయేడు కూడా ఇక్కడే చదివి ఫస్టుక్లాసులో పాసైనాడు. మనిషి చాలా బీదవాడంట గాని ఆ బీదతనం మాటల్లోగాని వేషంలోగాని కనిపిస్తుందేమో చూడండి. ఆటల్లో పాటల్లో అన్నింటిలోనూ పైకి వస్తున్నాడు. ఇంతకీ ఆతల్లి చేసుకొన్న పుణ్యం.

(60—వ పేజీ చూడండి)




తలనొప్పా?



అమృతాంజనము

కొంచెం రాయండి



వెంటనే గుణం కనిపిస్తుంది

మీకు అమృతాంజనము ఎప్పుడు కావలసివస్తుందో మీకే తెలియదు. ఇంట్లో ఎప్పుడూ ఒక బుడ్డిని ఉంచండి. ఎంతైనా నమ్మకమైనది.




అమృతాంజన్ లిమిటెడ్
14/15, లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ

JWT-AMJ 1090

## పంకిలి బ్రతుకులు

(13-వ పేజీ తరువాయి)

అప్పటికి నాలో అంకురించిన అనుమానం తెరలు విచ్చింది. మీనాక్షీ కొడుకు ఎక్కడివాడు ఎక్కడ తేలాడు?

ఒకరాత్రివేళ ఎందుకో మెలుకువ వచ్చింది. ఉన్నట్టుండి ఓ చిత్రమైనఆలోచన నన్ను నిలబెట్టి అడిగింది. 'ఈ పిల్లవాడు ఆకుటుంబంలోనే పెరిగిఉంటే?...జగన్నాథానికి మళ్ళీ పెళ్ళయిందని ఎప్పుడో విన్నాను. సంతానమూ కలిగిందేమో! వాళ్ళెలాఉన్నారో నాకేమీ తెలియదు. వీడే గనక అక్కడుంటే మళ్ళీ జగన్నాథంలా తయారయేవాడు. అర్థంలేని గారాబాలతో మంకుపట్టులతో మొద్దబ్బాయిఅయి కూర్చునేవాడు మీనాక్షి ఆ కూపంలోనుంచి బయటికివచ్చి తనకొడుకును మనిషిగాచేసింది. వాడికో ఉన్నతమైన స్థానాన్ని వ్యక్తిత్వాన్ని ఇచ్చింది. ఈ కొడుకును వెన్నుదట్టి తను ప్రపంచపు చీకటి తెరల మాటుకి తప్పుకొంది.

ఆదివారం పొద్దున్న తొమ్మిదయిందేమో మా రెండోవాడు వచ్చి "గోపాలకృష్ణ వచ్చాడు నాన్నా మీకోసం" అన్నాడు.

బయటికివచ్చాను. గోపాలకృష్ణ నమస్కరించాడు. మడతలు నలగని బట్టలతో గంభీరమైన రూపంతో ఉన్నాడు. ఆమాటలతీరే మనుషుల్ని ముగ్ధుల్ని చేస్తోంది.

ఏవోపుస్తకాలు నాదగ్గరున్నాయని తెలిసి వాటికోసం వచ్చానన్నాడు. తను వ్రాసిన ఖండిక ఒకటిచ్చి తప్పులు దిద్దమన్నాడు.

అతన్ని ఏవేవో ప్రశ్నించాను. చాలామంది కాలేజీకుర్రాళ్ళకుండే అహంకారం కన్పించలేదతనిలో. వినయంగా మాట్లాడుతున్నా దానివనకాల పట్టుదలా స్వేచ్ఛాప్రవృత్తీ తొణికిసలాడుతూనే ఉన్నాయి. అతను నాతో చాలా విషయాలు మాట్లాడాడు. ప్రతిచిన్న విషయంలోనూ అతనికో కచ్చితమైన అభిప్రాయం ఉన్నది. అతని ఉద్దేశాలు కొన్ని తలతిక్కగా కనిపించినా తార్కికంగా ఉన్నాయి. అతడికి మొత్తానికి పుస్తకపరిజ్ఞానం చాలా ఉందనీ ఇంకా అనుభవంమాత్రం చాలదనీ తెలుసుకున్నాను. అతనిపక్కనే కూర్చున్నారు మాగవీ, శశీ ఒళ్ళంతా కళ్ళు చేసుకొని. ఇలాంటి ఊహలు కలగవచ్చునేది వాళ్ళకసలు స్వప్నంలోకూడా తట్టిఉండదు.

"ఏ ఊరు బాబూ నీది? మీ నాన్నగారెవరు?" తెలీనట్టు అడిగాను.

ఆరేళ్ళ కిందట పదిపన్నెండేళ్ళవాడు. మసక వెలుతురులో చూశాను. గుర్తుపట్టాడనే భయంలేదు.

"ఇదివరకు రాజాపురంలో ఉండేవాళ్ళం. మా నాన్నగారు చనిపోయినతరువాత మా అమ్మ భద్రాచలందగ్గర ఉన్న పల్లెటూళ్ళో ఉంటున్నది."

"మీ నాన్నగారేంపని చేసేవారు?"

"క్వారీల కంట్రాక్టు, మా అమ్మగూడా అక్కడే చిన్నస్కూల్లో టీచరుగా పని చేసేది!

"మరి నువ్వెక్కడ చదివావు?"

"పక్కనే ఉన్న ఊళ్ళో హైస్కూల్లో చదువుకొనేవాణ్ణండీ, అయినా నేను చదువుకొన్నది ఎక్కువగా మా అమ్మదగ్గరేనండీ. మా అమ్మకు సాహిత్యం అంటే మరీఇష్టం. లైబ్రరీనుంచి పుస్తకాలు తెప్పించేది. తన సంపాదనా కాలమూ చాలావరకూ చదువుకే వినియోగించేది. మా అమ్మ నిజంగా చెప్పుకోవలసినమనిషి. తల్లినిగురించిన తలపే అతణ్ణి మహాసంతోషపరచింది. అతని ప్రేమా గౌరవం, ఆమెలో గూడు కట్టుకొన్నాయని తెలుసుకొన్నాను. అతని కళ్ళు తనతల్లినిగురించిన గర్వంతో తళతళలాడుతున్నాయి.

ఇక్కడే...సరిగ్గా ఇప్పుడేనాలో ఎవరో రాక్షసుడు ప్రవేశించాడు. ఆ గూడు పడగొట్టాలి. ఆ తళతళలు మసకేసిపోవాలి! ఈ పిల్లవాడికి తనతల్లి పతనగాథ తెలీదా? తెలిస్తే ఈ గర్వం నిలుస్తుందా?

> ఒకడు : ఒరే! సున్నకిసున్న చేరిస్తే ఏమవుతుందిరా?
>
> మరొకడు : రెండు సున్నలు.
>
> ఒకడు : తప్పు. సున్నంరా.
>
> ఎస్. ఆర్. ఎస్. శాస్త్రి (నూజవీడు)

'మీనాన్నగారిపేరేమిటన్నావ్?'

"శ్యామలరావు."

నాహృదయం భగ్గుమంది. పచ్చి అబద్ధం. ఏదో ఒక చిత్రమైన అనుభూతి గాలానికి గిజగిజలాడుతున్న ఎరను చూడాలనే వేటగాడి ప్రవృత్తి ఏదో నన్ను తరిమింది. నా కసలు ఏదీ గుర్తురాలేదేమో. నా పిల్లలెవ్వరికీ లేనిసంస్కారం విజ్ఞానం ఈ అనామకుడికి ఈ భ్రష్టురాలి కొడుక్కి ఉండటమా? అసలు నాకు కలిగినఉద్రేకం ఏమిటో నా సంస్కృతీ విగ్రహం, ఇన్నేళ్ళ చదువూ ఏమయినాయో నాకర్థం కాలేదా సమయంలో.

"కాదు.. మీనాన్న శ్యామలరావు కాదు" అన్నాను. 'కాదు' అరిచాను. "మీ నాన్న అని నీవు పిలుస్తున్న మనిషి మీనాన్న కాదు. మీ నాన్న జగన్నాథం. మాది నెల్లూరుజిల్లా ... నీ చిన్నప్పుడే నిన్ను తీసుకొని శ్యామలరావుతో లేచిపోయింది. ఎన్నాళ్ళు ఇలా లోకం కళ్ళు కప్పుతారు మీరు" అనేశాను.

అసలీ దెబ్బ షాక్ అతనికి. ఇంతకంటే అతనికి దారుణం మరొకటిలేదు. చప్పున నిలుచున్నాడు. కళ్ళు ఎర్రబడ్డాయి, పెదవు లదురుతున్నాయి.

పిడికిళ్ళు బిగుసుకొంటున్నాయి.

"మా అమ్మ.. మా అమ్మ" అంటున్నాడు అర్థంలేకుండా రవీ శశీ దిమ్మెరపోయినారు.

"మీ అమ్మ...మీ అమ్మ నేఅడుగు చెబుతుంది" అన్నాను వెకిలిగా నవ్వుతూ.

పిచ్చిగా జుట్టుపీక్కుంటూ బయటికి పోయాడు. అతడు తెచ్చిన కాగితాలు ధూళిలో పొర్లుతున్నాయి, అతని గౌరవాభిమానాలులాగే.

ఇప్పటికే పెద్దదయిన కథను ఇంకా పొడిగించను. ఏం జరిగిందో పాఠకులు ఊహించే ఉంటారు. మర్నాటినుంచీ గోపీ కనిపించలేదాఊళ్ళో. రవి వెళ్ళి కనుక్కొని ఆ రాత్రే వెళ్ళిపోయాడని సామానంతా అలాగే ఉందని కబురు చెప్పాడు. నాలుగురోజు లయింతరువాత నా పేర నొక ఉత్తరం వచ్చింది.

మాష్టారూ.

నా నుంచి మీ రెన్నడూ ఉత్తరాన్నాశించిఉండరు. మీ రేఉద్దేశంతో నా గోపీకి ఈ కథ చెప్పారో నాకు తెలీదు గాని


## చదవాలి - సుఖపడాలి

దాంపత్య జీవితంలో [illegible] ముఖ్యంగా డాక్టర్లు కనుగొన్న కొన్ని అమూల్య రహస్యాలు "జీవిత రహస్యాలు' పుస్తకంలో ఉన్నాయి. ఇంకా అంగులో [illegible] ధాతువుకు [illegible] అబద్ధమని ఎలా నిరూపించారు, బీజాలు వగలువల్ల ఫలితాలు, వాటిలో నొప్పులువల్ల, [illegible] బీజాలు, సుఖవ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు. దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి కనుగొన్న మార్గాలు, కుటుంబ నియంత్రణ మార్గాలు, యింకా మీ జీవితంలో [illegible] తెలుసుకోవలసిన అన్ని సంగతులు. "జీవిత రహస్యాలు' అనే ఈ తెలుగు పుస్తకంలో ఉన్నాయి. వెల రు. 3-50 పోస్టు ఖర్చు ఉచితం. ఇది క్రిందిచోట్ల దొరుకును. [illegible] ప్రముఖులు. [illegible] ఏలూరు, ఆంధ్రకు వ్రాసి వి. పి. పోస్టుద్వారా మీకూ పంపబడును

SWATIK

మీ మీద అంత నేరం రుద్దటానికి నా మనస్సు ఒప్పుకోవటంలేదు.

నేను బయటికి వచ్చేశాను. మీ రనుకొన్నట్లే, శ్యామలరావు చేయూతతో. అలాగే ఆ మురికూపంలో పడి తన్నుకొంటూ అప్పుడప్పుడు మీ అందరి సానుభూతి కోరుతూ కన్నీళ్లూ పెట్టుకొంటుంటే మీలాంటి పెద్దల మనస్సులకు తృప్తి కలిగేదేమోగాని నిజంగ సమస్యకు పరిష్కారమార్గం వెతుక్కునేటప్పటికి అందరూ కత్తులుగట్టారు. లేకపోతే పదహారేళ్ల కిందటి కథ మీరు అభమూ శుభమూ తెలియని గోపీ ముందు ఏకరువు పెట్టటంలో అర్థమేముంది.

నా చెయ్యిపట్టుకొని పైకి లాగటానికి మీ వంటి పెద్దమనుషులు గౌరవనీయులూ ముందుకు రారనీ, ఊరికే మాట పోగొట్టుకోవటమే మిగులుతుందనీ నాకు తెలుసు. నా సంగతి శ్యామలరావుతో చెప్పాను. అలాంటివాడే ముందుకు రావాలనీ తెలుసు. కాని మీ రనుకొన్నట్టి ప్రవృత్తి నాకులేదు. మీరు నమ్ముతారో లేదో. నమ్మకపోయినా ఇప్పుడు నాకు కలిగేనష్టమూ లేదనుకోండి. శ్యామలరావు అండతో గోదావరి నీడన నాకు ఆశ్రయం దొరికింది. సంఘంలో పెద్దమనిషి కాదు అతను. సంస్కారిగాడు. మాటలూ చెప్పలేదు. అయినా నా చెంత కూడా రాకుండా నాగోపీకి తండ్రిగా నిలిచి సంఘంలో స్థానమిచ్చాడు.

పదిమంది పిల్లలకు చదువు చెప్పుకునీ, కుట్టుపని చేసుకొనీ నా గోపీని పెంచుకొన్నాను. మనిషిగా నిలబెట్టాను. కష్టమూ సుఖమూ నేర్చుకొన్నాను. ఏనాడూ శ్యామలరావు దగ్గర్నుంచి డబ్బు ఆశించనూ లేదు. ఇద్దామని ప్రయత్నించి అతనెన్నడూ కించపరచనూలేదు. మానసికంగా అతను నాకు ఎంతో బలాన్నిచ్చాడు. చివరికి ఒక్క ప్రాణిని రక్షించిన పుణ్యమైనా దక్కించుకొన్నాడు.

ఏనాడైనా గోపీకి తెలీకమానవు. అది నాకు తెలుసు. అయినా చిన్నప్పటినుంచీ యిలాంటి ఆలోచన్లు రేపితే అవి వ్యక్తిత్వాన్ని బలహీనపరుస్తాయని దాచి ఉంచాను. కొంత వయసూ అనుభవమూ వచ్చినతరువాత వాడితో నేనే చెప్పి వాడిచ్చే శిక్షను స్వయంగా అనుభవించాలని అనుకున్నాను గాని యీలోగా మీరా కాస్త పుణ్యమూ మూటకట్టుకొన్నారు. గుండెల్లో యిమిడని ఆ దెబ్బ వాడిలో లోతుగా గుచ్చుకొంది. నిజమైన బతుకు వాడిది. పయి కొకటే లోప లొకటే అనేది వాడికి తెలీకుండా పెంచుకొచ్చాను.

మీ మాటలతో నా బిడ్డ దేశాలు పట్టిపోయినాడు. తిరిగి నా మొహం చూడటానికి కూడా వాడికిష్టం కలగలేదు. ఇంకో పదేళ్ల తరువాత వాడికి నా సంగతి తెలిస్తే "మరేం ఫర్వాలేదు. అంతేగదా" అనేవాడే నిశ్చయంగా. వాడి సంస్కారం తెలుసు నాకు. కాని వానిలేతగుండె అప్పుడే ఈ దెబ్బ ఓర్చుకోలేకపోయింది.


అయిపోయింది. సంకుచితత్వం జీర్ణించుకొన్న లోకంలో పోరాడి ఓడిపోయాను. చివరికి నాకు మిగిలిన ఆ ఒక్క ఆశా తుంచివేసేదాకా ఊరుకోని సంఘానికి సెలవు. మరోక జన్మ అనేది ఉంటుందోలేదో నాకు తెలీదు. తెలుసుకోటానికి నేనెన్నడూ ప్రయత్నించనూలేదు. ఒకవేళ ఉంటే స్త్రీగా పుట్టగూడదనీ, పుట్టినా తెలుగు దేశంలోమాత్రం పుట్టగూడదనీ కోరుకుంటున్నాను.

నాకు సరిపోని నా తావరణం లోనుంచి బయటికి వచ్చాననేగా నాకింత శిక్ష! ఇంచుమించు రెండు ప్రాణాలను నిలువునా హత్య చేసిన మీరు పెద్దమనుషులే. మీ పిల్లలకు గౌరవంగాజీవించటానికి హక్కుంది. సరే అలాగే పదికాలాలు జీవించండి. కాని మాగోపిలాంటి వాళ్లనుమాత్రం యిలా సజీవంగా నాశనంచేయాలని ప్రయత్నించకండి."

మీనాక్షి.

హంతకుణ్నే... కాదు పెద్దమనిషిని. కల్చర్డ్ సొసైటి అధ్యక్షుడిని. కవిని. రచయితను. గౌరవనీయుణ్ణి. ★


## లక్మే కృతమౌ సౌందర్యం




క్రీగంటి చూపుల కాటుక నయనం, ఆకర్షణీయక లలాట తిలకం, సింధూర శృంగార మందార బంధుర మధురా ధరం, సిగ దురిమిన సుమజాల పరిమళం. లక్మె టాల్కమ్ పౌడర్ విరళిత శరీర నిర్మల శీతల ఘన సౌరభం!

'లక్మె టాల్కమ్ పౌడర్' రహితం. నారీమణి శృంగారం సర్వ శూన్యం. ప్రాతఃకాలపు స్నానానంతరం, శరీరమంతటా లక్మె టాల్కమ్ పౌడర్ రాసుకొని హాయిగొలిపే దానిశీతల కరమగు పరిమళంబుతో రోజల్లా హాయిగా ఉండగలరు.

సౌందర్యకర
హిమబిందువు

లక్మె

లక్మె ఒక టాటా ప్రోత్సాహితము

LKY-12T-TEL